
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

# ఆకాశ రాజు

హార్థిక



**డేగ వేటాడం ఎప్పుడైనా చూశారా? ఆకాశంలో నుంచి రివ్వున కిందకు దూసుకొచ్చి పామునో, కోడిపిల్లనో కాలి గోళ్ళతో చటుక్కున పట్టేయడం ఎన్నడైనా చూశారా? అది నిజంగా ఒళ్ళు గగుర్పొడిచే దృశ్యం. నా చిన్నప్పుడు చూసిన ఆ దృశ్యాలు ఇప్పటికీ మనసుపొరల్లో కదలాడుతూనే ఉంటాయి. నాకు అప్పుడు 13 ఏళ్ళు ఉంటాయేమో! చెరువుగట్టు మీద కూర్చుని, దగ్గర్లోని రైలు పట్టాల పక్కన బర్రెలను మేపుకొంటూ ఉండేవాణ్ణి. ఆ శీతాకాలం మధ్యాహ్నం పొదలో కలకలం వినిపించింది. ఓ పక్షి కలవరంగా పొదలో నుంచి పైకి ఎగిరింది. గడ్డి పొదలో నుంచి ఓ పాము ఒక పిచ్చుకను నోటపట్టింది. అందుకే ఆ చుట్టుపక్కల పక్షులు కలవరపడ్డాయి. నా గుండె భయంతో కొట్టుకు లాడింది. ఆకాశంలోకి చూశాను. అక్కడ కొన్ని డేగలు రెక్కలు విప్పార్చుకుని ఎగురుతున్నాయి.**

నేల మీద నా చుట్టూ ఆవరించివున్న ఒంటరితనం భయపెడుతోంది. గుండె చిక్కబట్టుకుని వడివడిగా పాము పొదకు దూరంగానడిచాను. అలా నడుస్తూ మళ్ళీ ఆకాశం వైపు తల ఎత్తాను. పైనుంచి రెండు డేగలు రివ్వున కిందకు దూసుకొస్తున్నాయి. వాటిలో చిన్నది మగ డేగ అనుకుంటా. వాటిలో పెద్దదైన ఆడ డేగ రాకెట్‌లా దూసుకొచ్చి పామును కాళ్ళతో పట్టేసింది. ఆ తర్వాత రెండు మూడు రోజుల వరకు కూడా ఆ దృశ్యం నా కలల్లో కదలాడింది. క్రమంగా భయం తగ్గింది. నన్ను కూడా మహా డేగలు కాళ్ళతో పట్టుకుని ఆకాశంలోకి తీసుకెళ్ళినట్లు కలలు రాసాగాయి. ఆ కలల్లో నింగి నుంచి సగర్వంగా నేల మీదకు చూపులు సారించేవాణ్ణి. అప్పటి నుంచి డేగ నా అభిమాన పక్షిరాజం అయింది. పట్టణాల్లో నివసించే వారు టెలివిజన్‌లో డిస్కవరీ, నేషనల్ జాగ్రఫిక్ వంటి చానళ్ళలో డేగల్ని చూసేవుంటారు కానీ, ఆ దృశ్యాలేవీ అసలైన అనుభూతి ఇవ్వలేవు. పల్లెల్లో శీతాకాలం వాటిని ప్రత్యక్షంగా చూడటంలోని అనుభూతే వేరు.

డేగ ఎంతో ఆరితేరిన వేటగాడిలాంటిది. క్రమశిక్షణ, ధైర్యసాహసాలు కలగలసిన సమురాయ్ వంటిది. తన ఆహారంగా పనికొచ్చే పాములు, కోడి పిల్లలు, కుందేళ్ళ మీదకు గంటకు 150 కి.మీల వేగంతో దూసుకొచ్చి గురి తప్పకుండా దాడిచేయగలదు. అన్నింటినీ మించి దాని కంటిచూపు మహా తీక్షణమైనది. డేగ నేత్రం, మానవ నేత్రంకన్నా ఎనిమిదిరెట్లు శక్తిమంతమైంది. అది ఆకాశంలో ఎగురుతూ, అక్కడి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో నేల మీద ఉన్న చిన్న చిన్న జంతువులను చప్పున గుర్తుపట్టగలదు. డేగకు నిశిత దృష్టి ఉంది. దాని ఏకాగ్ర దృష్టిలో అపారమైన సావధానత ఉంది. ధ్యానమగ్నత

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
Glorious Past-Brighter Future

ఉంది.

***

ఇంగ్లండ్ వంటి చిన్న దేశపు రాణి ఇండియా అంత పెద్ద దేశాన్ని, ఇంకా ఎన్నో ఇతర దేశాలను ఎక్కడో దూరాన ఉన్న లండన్ నుంచి అంతకాలం ఎలా పరిపాలించగలిగింది? బాల్యంలో నా మనసును తొలిచేసిన ప్రశ్న ఇది. అలాగే మన టాటాలూ, బిర్లాలూ, వాళ్ళను మించి అనేకానేక బహుళజాతి సంస్థల సి. ఇ. ఓలు ఎక్కడో ఉన్న తమ ప్రధాన కార్యాలయాల నుంచి దేశదేశాల్లో తమ వ్యాపారాలను అంత లాభసాటిగా ఎలా నడపగలుగుతున్నారు? వయసు వచ్చాక నా వెంట పడిన ప్రశ్న ఇది. నా మిత్రుడు రమణమూర్తి కూడా బ్రిటిష్ రాణిలా. బహుళజాతి సంస్థల సి. ఇ. ఓల్లా తన వ్యవహారాలను ఎంతో పరిపూర్ణంగా నిర్వహిస్తాడు.

అతణ్ణి చూస్తే ఆకాశరాజు డేగ గుర్తుకొస్తుంది. డేగకీ రమణమూర్తికీ తేడా ఒకటుంది. అది డేగ దృష్టితీక్షాతితీక్ష్ణమైతే రమణమూర్తి దాదాపు అంధుడు. డేగ ఆకాశంలో అల్లంత ఎత్తు నుంచి మూడు కిలోమీటర్లకు మించిన దూరం చూడగలిగితే నా మిత్రుడు రమణ మూడు అడుగుల దూరమైనా స్పష్టంగా చూడలేడు. అంతా నలుపూ తెలుపులోనే, అదీ చాలా మసకమసకగా కనిపిస్తుంది. అతడి జ్ఞాపకశక్తి అమోఘం. మనసులో తిష్ఠ వేసుకున్న కొన్ని బండ గుర్తుల ఆధారంగా మనుషులను పోల్చుకుంటాడు. మనుషుల కంఠస్వరం బట్టి, వస్తువుల పరిమాణం బట్టి పోల్చుకుంటాడు.

రమణమూర్తి చిన్నప్పటి నుంచీ కూడా శారీరకంగా బలహీనుడే. అతడు నా కన్నా నాలుగేళ్ళు చిన్న. అతడి అన్న పాఠశాలలో నా సహాధ్యాయి. వాడికన్నా వాడి తమ్ముడు-రమణమూర్తి మీదే నాకు అభిమానం ఎక్కువ. చిన్నప్పుడు రమణమూర్తి చూపు బాగానే ఉండేది. మరింత వెలుగు, కాస్త పెద్ద అక్షరాలు ఉంటే చాలు, చక్కగా చదువుకోగలిగేవాడు. నోట్స్ రాసుకోవడంలో తల్లి సహాయపడేది. తర్వాత, క్లాస్‌మేట్స్- ఎక్కువగా ఆడపిల్లలు ఎంతో ఆప్యాయంగా నోట్స్ రాసిపెట్టేవారు. మాలాంటి సీనియర్లు పరీక్షల సమయంలో ముఖ్యమైన ప్రశ్నలతో మోడల్ ప్రశ్నా పత్రాలు ఇచ్చి అతడు పాస్ కావడానికి సాయపడేవాళ్ళం.

మనం ఏదైనా ప్రశ్న వేశామనుకోండి. అది చిన్న ప్రశ్న అయినా సరే రమణమూర్తి సుదీర్ఘంగా ఆలోచించి కానీ బదులుచెప్పేవాడు కాడు. అదీకూడా ధ్యానం ముగించిన యోగిలా జవాబిచ్చేవాడు. రమణ బలే సరదా మనిషి. ఎప్పుడు చూసినా జోకులు పేల్చేవాడు. రమణ తోటి పిల్లల్లా బలంగా ఉండేవాడు కాదు కనుక ఆటపాటల్లో చేరేవాడు కాదు. అయితే, ప్రతిదీ నిశితంగా గమనించేవాడు. ఎప్పుడు చూసినా ఏదో ధ్యానముద్రలో ఉన్నట్లు కనిపించేవాడు. రానురానూ చూపు సన్నగిల్లుతుండటంతో, ఎదుటివారు చెప్పేది శ్రద్ధగా ఆలకించడం, వారి మాటల వెనుక ఉన్న అర్థాన్నీ, భావోద్వేగాన్నీ మౌనంగా ఆకళింపు చేసుకోవడం అలవాటు చేసుకున్నాడు. ఆ మౌనం నుంచే ఆచరణ ఆరంభించేవాడు.

క్రమంగా చూపు పడిపోతున్నా తన రుగ్మత గురించి అదేపనిగా బాధపడేవాడు కాడు. తాను జీవితంలో దేనికీ గర్వపడకుండా చూడటానికే దేవుడు తనపై ఈ పరిమితి విధించాడని రాజీపడటం నేర్చుకున్నాడు. అతడి తల్లిదండ్రులు చాలామంది వైద్యులకి చూపించారు. అతడి మెదడుకు దృశ్యసంకేతాలు పంపే ఆప్టికల్ నాడిలో లోపం ఉందని వారు చెప్పారు. రమణ మూడు రోజుల బిడ్డగా ఉన్నప్పుడు వచ్చిన జ్వరమే అతడి ఆప్టికల్ నాడిని దెబ్బతీసింది. ఆప్టికల్ నాడిని సరిచేసే వైద్యం అందుబాటులో లేకపోవడం వల్ల రమణమూర్తికి చూపు నానాటికీ మందగించసాగింది.

అతడితో నా స్నేహం 20 ఏళ్లకు పైనుంచీ, ఇన్నేళ్ళలో మాస్నేహాన్ని ఉపయోగించుకునే ప్రయత్నమేదీ అతడు చేయలేదు. పైగా, ఆహారవిహారాల్లో పాటించవలసిన నియమనిబంధనలు, లాభదాయక

అతణ్ణి చూస్తే ఆకాశరాజు డేగ గుర్తుకొస్తుంది. డేగకీ రమణమూర్తికీ తేడా ఒకటుంది. అది డేగ దృష్టితీక్షాతితీక్ష్ణ మైతే రమణమూర్తి దాదాపు అంధుడు. డేగ ఆకాశంలో అల్లంత ఎత్తు నుంచి మూడు కిలోమీటర్లకు మించిన దూరం చూడగలిగితే నా మిత్రుడు రమణ మూడు అడుగుల దూరమైనా స్పష్టంగా చూడలేడు. అంతా నలుపూ తెలుపులోనే, అదీ చాలా మసకమసకగా కనిపిస్తుంది.

మైన ఆర్థిక సూత్రాల గురించి నాకు బోధించేవాడు. నాకే కాదు, తన పరిచయస్థులందరికీ ఇలా విలువైన సలహాలు ఇచ్చేవాడు. పరోపకారంలోనే స్వహితం ఉందని గ్రహించి, దానికి అనుగుణంగా తన జీవితంలో విజయ సాధన వ్యూహం రూపొందించుకున్నాడు. ఎదుటివాళ్ళకు తనవల్ల వీలైనంత సహాయమూ చేయడం, తర్వాత అవసరం వచ్చినప్పుడు ఎంతో అణకువగా సహాయం అర్థించడం ఇదే అతడి జీవిత వ్యూహం. సంఘంలో డబ్బూ, పలుకుబడి ఉన్నవారి గురించి తెలుసుకోదగినంతా తెలుసుకోవడం, వారికి దగ్గర కావడం, వారికి పనులుచేసిపెట్టడం, వారి పరిచయంతో తానూ లాభపడటం ఆ వ్యూహ సూత్రాలు. మంచి ప్రవర్తన, బాధ్యతగా ప్రవర్తించడం, పరోపకారం ఈ గుణాలతో ఎదుటివారిని ఆకట్టుకోవడం, తానేదైనా సహాయమడిగినప్పుడు వారు కాదనలేని స్థితిని కల్పించడం అతని విజయ రహస్యం.

నాకు 18 ఏళ్ల వయసులో తీవ్ర అస్వస్థతకు గురయ్యాను. మూడు నెలలపాటు పడక మీదే ఉండి, అస్థిపంజరంలా తయారయ్యాను. అలోపతి డాక్టర్ల వద్ద ఎన్ని మందులు వాడినా రోగం తగ్గలేదు. చివరకు మా అన్నయ్య ఓ హోమియోపతి వైద్యుడి వద్దకు తీసుకువెళ్ళాడు. ఆయన మందులు బాగా పనిచేసి మామూలు మనిషిని అయ్యాను రోగం నయమైనా, నేను మాత్రం పూర్తిగా బక్కచిక్కిపోయాను. ఆ స్థితిలో నేను రమణమూర్తి దగ్గరకు వెళ్ళి యోగ నేర్చుకున్నాను.

రమణ 14 ఏళ్ళ వయసు నుంచే తన కంటి చూపు మెరుగుపరచుకోవడానికి యోగ, సూర్య నమస్కారాలు నేర్చుకునేవాడు. సందుదొరికితే చాలు గోడకు శీర్షాసనం వేసేవాడు. దాన్ని వల్ల తలకు బాగా రక్త ప్రసారం జరిగి కంటి చూపు మెరుగుపడుతుందని ఆశ. చూపు సంగతేమో కానీ శీర్షాసనం అతడి బుర్రను మాత్రం మహా చురుగ్గా పనిచేసేట్లు చేసింది. పైగా అతడు ఏ విషయాన్నైనా సరే అవసరమైనంత వరకే నేర్చుకునేవాడు. ఎక్కడా 'అతి' చేయడు. అందువల్ల, అనేకమంది ఇతరుల మాదిరిగా విజ్ఞానం రమణను అయోమయంలోకి నెట్టలేదు. నాతో వెంటనే అదేపనిగా ఆసనాలు వేయించడం కాకుండా ఒక వారం రోజులపాటు ఆసనాలు నేర్పించి, మాంసాహారం నుంచి శాకాహారానికి మార్పించాడు. ఇతర ఆహార నియమాలు బోధించాడు. అలా నా జీర్ణశక్తి మెరుగయ్యేట్లు చేశాడు. ఆ రోజుల్లో బ్రూస్ లీ సినిమాలను జనం వేలంవెర్రిగా చూశారు. నాకూ ఆ సినిమాలు చూసి కరాటే నేర్చుకోవాలనిపించింది. దానికి రమణ అభ్యంతరపెట్టలేదు. కరాటేకి తోడుగా ప్రాణయామం చేస్తే భేషుగా ఉంటుందని సలహా ఇచ్చాడు. ప్రాణాయామంలో పాఠాలు బోధించాడు. ప్రాణాయామం నాలో నింపాదిని తీసుకొచ్చింది. నా కరాటే దూకుడుగా మారకుండా అదుపులో పెట్టింది. రమణను ఎవరైనా ఎగతాళి చేస్తే నేను అండగా నిలిచేవాణ్ణి. మాది కృష్ణుడు-అర్జునుడి సంబంధమన్న మాట.

రమణమూర్తి పదో తరగతి తర్వాత ఐ.టి. ఐలో బుక్‌బైండింగ్ కోర్సు చేసినా బైండర్ ఉద్యోగంలో చేరడం కానీ, సొంత దుకాణం పెట్టుకోవడంకానీ చేయలేదు. నేను ఇంజనీరింగ్ పూర్తిచేసి, పదేళ్ళపాటు వేరువేరు ఊళ్ళలో ఓ కంపెనీలో పనిచేసి, చివరకు సొంత పట్టణానికి తిరిగొచ్చి సొంతగా వ్యాపారం ఆరంభించాను. ఈ మధ్యకాలంలో అంటే పది, పదిహేనేళ్ళపాటు మా ఇద్దరి మధ్య సంబంధాలు లేకుండా పోయాయి. సొంత ఊరికి తిరిగివచ్చాక మళ్లీ పాత స్నేహం చిగురించింది. ఈ లోపు నాలానే అతడికీ పెళ్ళి అయ్యి ఇద్దరు పిల్లలు కలిగారు.

ఈ పదిహేనేళ్ళ కాలంలో రమణ దాదాపు మునిలా తయారయ్యాడు. ఒంటి కాలి మీద మౌనంగా జపం చేస్తూ చేప దొరకగానే చటుక్కున నోటకరచే కొంగలా, రమణ ధ్యానముద్రలో ఉంటూ అవకాశం దొరికిన వెంటనే చప్పున పట్టేయడం నేర్చుకున్నాడు.

***

రమణమూర్తి చదువు పూర్తయ్యాక పి. జగన్మోహన్ రావు అనే ఓ మంచి మనిషిని ఆశ్రయించాడు. మోహన్ మంచి మనిషే కాదు, సాహసప్రవృత్తి గలవాడు కూడా. ఆయన రకరకాల వ్యాపారాలు చేస్తుంటాడు. రమణ ఆయన వద్ద పనికి కుదిరి ఆయనకు అన్ని విధాల చేదోడువాదోడుగా నిలిచాడు. రమణకు పెళ్ళికాగానే, అతడి తండ్రి కట్టిన చిన్న ఇంటికి

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
गौरवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

అదనంగా మరో చిన్నగది కట్టుకోవడానికి మోహన్ సహాయపడ్డాడు. కొత్త దంపతుల కోసం ఆ గది అన్న మాట. రమణకు మంచి జీతమే ఇచ్చేవాడు. అందులో కొంత దాచుకుని ఉద్యోగంతోపాటు వేన్నీళ్లకు చన్నీళ్ళుగా షేర్ల వ్యాపారం కూడా చేయడం మొదలుపెట్టాడు రమణ. తనకున్న ఇతర వ్యాపారాలకు తోడు గనులతవ్వకం కూడా చేపట్టాడు మోహన్. ఆ కొత్త వ్యాపారానికి సంబంధించిన పనుల్లో ఎక్కువ భాగం రమణే చూసుకునేవాడు. రకరకాల వ్యాపారాల ఒత్తిళ్ళలో పి.జె.ఎం ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, రమణ ఆయన వెంటే ఉండి యోగ, ప్రకృతి వైద్యాలతో ఆయనకు కంపెనీ ఇస్తూ, ఆయనేది తింటే అది తింటూ, ఉత్సాహాన్నిస్తూ, ఆయన స్వస్థతకు తోడ్పడ్డాడు. కొన్నేళ్ళకు పి.జె.ఎమ్ కొడుకులు పెద్దవాళ్ళయ్యి తండ్రి వ్యాపారం చూసుకోసాగారు. కుర్రాళ్ళలో సహజంగా ఉండే దూకుడు వల్ల, వారికి రమణమూర్తి అవసరం కనిపించలేదు. మారిన పరిస్థితులను గమనించిన రమణమూర్తి, కుర్ర యజమానులు పొమ్మనకముందే హుందాగా వారి కంపెనీ నుంచి బయటికొచ్చాడు. పిజె ఎమ్ తన పలుకుబడి ఉపయోగించి రమణకు ఊరిలోని ప్రభుత్వ గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఉద్యోగం ఇప్పించాడు.

***

ఉద్యోగం మీద వేరే ఊళ్ళకు వెళ్ళిన నేను దశాబ్దం తర్వాత సొంత ఊరికి వచ్చి వ్యాపారం మొదలుపెట్టాను. వ్యాపార ఒత్తిళ్ళలో మునిగిపోయిన నేను దాదాపు ఆరేళ్ళ వరకు కూడా రమణమూర్తిని కలవలేదు-దారిలో కనిపించినపుడు హలో అనడం తప్ప. రమణ కూడా ఓర్పుగా నిరీక్షించాడు. ఈ మధ్యకాలంలో నా వ్యాపారం ఒక గాడిలో పడింది కానీ నేను మాత్రం బాగా లావు అయ్యాను. యోగ, ప్రకృతి వైద్యాలతో రమణకు బాగా పరిచయం ఉందని నాకు తెలుసు కాబట్టి, అతని సహాయం అర్థించాను. ఉదయంపూట నడకతో పాటు పచ్చికూరగాయలు, మొలకెత్తించి నీడలో ఆరబెట్టిన గింజలను పిండి చేసి రొట్టెలు చేసుకుని తినమని నాకుసలహా ఇచ్చాడు. ఆ పిండిని తానేతయారుచేసి ఇస్తున్నా దానికి డబ్బు అడిగేవాడు కాడు. అయితే, నా అంతట నేనే అతడి శ్రమకూ, పిండికీ తగిన ధర చెల్లించేవాణ్ణి. రమణమూర్తి నాకు విధించిన ఏకైక నిబంధన-శాకాహారమే తీసుకోవాలని. క్రమంగా నేను ఒళ్లు తగ్గి, ఆరోగ్యంగా తయారయ్యాను. మళ్ళీ 20 ఏళ్ళ యువకుడిలా చురుకుగా మారాను.

అలా రెండేళ్ళు గడిచాక రమణమూర్తికి నాతో పని పడింది. ఊళ్ళో ఒక స్థలం కొన్నాడు ఈ మధ్య. అందులో ఉన్న పాత ఇంటిని పడగొట్టి చక్కని కొత్త ఇల్లు కట్టుకోవాలని అతడి ఆలోచన. ఆ లక్ష్యం కోసం తన డేగ దృష్టిని కేంద్రీకరించాడు. వేటలో మగ డేగకు ఆడ డేగ సహకరించినట్లు, నేను అతడికి స్నేహ హస్తం, సహాయ హస్తం అందించాను. నా పనుల ఒత్తిళ్లలో కూడా కొంత సమయాన్ని అతడికి కేటాయించి ఇంటి ప్లాన్ వేయడం, దాన్ని ఆచరణలో పెట్టడం, ఇంకా చిన్నా చితకా పనులలో తోడ్పడసాగాను. ఆశ్చర్యమేమంటే, రమణమూర్తి నా మీద పెద్దగా ఆధారపడకపోవడం. అంతకుముందు మోహన్ రావు గారి పనిచేసినప్పుడు ఏర్పడిన విస్తృత వ్యాపార పరిచయాలు ఇంటి నిర్మాణంలో అతడికి అక్కరకొచ్చాయి. వడ్రంగులు, ఇటుక బట్టీల యజమానులు, ఇసుక, ఇనుము వ్యాపారులు – ఇలా ఒక్కరనేమిటి రకరకాల వ్యాపారులు, నిపుణులు అతడికి బాగా తెలుసు. ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు వారంతా తక్కువ ధరకు నాణ్యమైన సామగ్రి అందించేవారు. నా ఇంజనీరింగ్‌పరిజ్ఞానం, పనులు చేయించడంలో నా అనుభవాన్ని రమణమూర్తి స్వీకరించాడు. చూస్తుండగానే అతడి ఇల్లు పూర్తి అయింది. లైబ్రేరియన్ వంటి చిన్న ఉద్యోగం చేస్తున్నా ఒక బ్యాంకు అధికారిలా మంచి ఇల్లు కట్టుకోగలిగాడు. ఇది ఎలా సాధ్యపడింది? రమణకు ఈ ప్రశ్నే వేశాను. దానికి అతడు మందహాసం చేసి, ఇలా ఎదురు ప్రశ్నించాడు.

''హర్షద్ మెహతా పేరు వినే ఉంటావు కదా!''

''విన్నాను భారతదేశంలో అతి పెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణం అతడి చలవే కదా!''

''అవును అయితే, కుంభకోణానికి ముందు హర్షద్ స్టాక్‌మార్కెట్‌లో గొప్ప సందడి సృష్టించాడు. విలువైన షేర్లతోపాటు పనికిమాలిన షేర్ల ధరలు కూడా అప్పట్లో చుక్కలనంటాయి. ఆ ఊపులో నేను కూడా షేర్ల వ్యాపారంలోకి దిగాను. అందులో నాకు అనుభవం లేకపోయినా మన మిత్రుడు బాబు నాన్నగారు నాకు సాయపడ్డారు'' అని చెప్పాడు రమణ. అతడు ప్రస్తావించిన బాబు నాన్నగారు రిటైర్డ్ పంచాయితీ అధికారి.

''ఇద్దరు కలసి బిజినెస్ పత్రికలు చదివేవాళ్ళం. కొత్తగా పబ్లిక్ ఇష్యూకు వస్తున్న కంపెనీల గురించి క్షుణ్ణంగా తెలుసుకునేవాళ్ళం. అందరూ ఒకటి రెండు పత్రికలు చదివితే మేము ఏకంగా ఆరు పత్రికలు తెప్పించుకునేవాళ్ళం- చెరి మూడు చొప్పున. మిగతా వాళ్ళంతా వేలంవెర్రిగా స్టాక్ మార్కెట్‌లో దిగితే మేము ఎంతో పరిశోధన, పరిశీలన జరిపి కానీ పెట్టుబడులు పెట్టేవాళ్ళం కాము. అదీ ప్రసిద్ధమైన కంపెనీలలోనే'' వివరించాడు రమణ.

''అది చాలా మంచి ఐడియా. అప్పట్లో మీరు ఎంత పెట్టుబడి పెట్టారు'' అడిగాను.


''నేను 45,000 రూపాయలు, పెద్దాయన 75,000 రూపాయలు పెట్టుబడి పెట్టాం. కొన్ని ముఖ్యమైన పద్ధతులు పాటించేవాళ్ళం. ఉదాహరణకు ఏదైనా కంపెనీ ఒక దరఖాస్తుకు 100 షేర్లు ఇవ్వజూపిందనుకుందాం. దాని పబ్లిక్ ఇష్యూ 25 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రైబ్ అవుతుందని అంచనాకు వస్తే, మేము 2500 షేర్లకు దరఖాస్తు పెట్టేవాళ్ళం. చివరకు మాకు కనీసం 100 షేర్లు ఎలాట్ అయ్యేవి. అప్పట్లో హర్షద్ సృష్టించిన బూమ్ వల్ల చూస్తూ ఉండగానే వాటి ధర పెరిగిపోయేది. నా 45 వేల పెట్టుబడి రెండు ఏళ్ళలో రెండున్నర లక్షలకు చేరింది '' అని చెప్పాడు రమణ.

''తర్వాత మార్కెట్ పతనమైందిగా! మీకూ నష్టం వచ్చిందా?''

''రాలేం! అయితే, హర్షద్ గురించి నీలివార్తలు రావడం మొదలుపెట్టగానే నా షేర్లు అన్నీ తీసుకెళ్లి స్టాక్‌బ్రోకర్ వద్దకు వెళ్ళి అమ్మిపెట్టమన్నాను. అతడు వెనుకాముందులాడాడు. మరి కొన్నాళ్ళు ఆగవచ్చు కదా అన్నాడు. నేను నిర్ణయం మార్చుకోలేదు. మీకు మార్కెట్ మీదనమ్మకం ఉంటే మీరే ఈ షేర్లు కొనుక్కొని నాకు డబ్బు ఇచ్చేయండి అని చెప్పాను. నా దృఢ నిర్ణయం బ్రోకర్‌ను కుదిపేసింది. ఇక వాదించకుండా నా షేర్లన్నీ అమ్మి పెట్టాడు. ఈ లోగా మార్కెట్ పతనమైంది. నా వరకు నాకు 25 వేలు నష్టం వచ్చినా, మిగతా రెండు లక్షల పాతిక వేలూ మిగిలాయి'' అని చెప్పాడు రమణ.

''నీది మంచి నిర్ణయం. ఆ డబ్బు ఏం చేశావు?''

''నా చేతిలోని డబ్బుతో ఈసారి రియల్ ఎస్టేట్‌లో దిగాను. ఊరికి కాస్త దూరంగా చవకగా దొరికే చోట గొల్లపూడిలో లక్షా నలభైవేల రూపాయలతో స్థలం కొన్నాను. ఊరు పెరిగిన తర్వాత అక్కడ ఇల్లు కట్టుకుందామని నా ఆలోచన. అక్కడ ఇంకా ఊరు



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
Glorious Past-Brighter Future

పెరగలేదు కానీ రేట్లు విపరీతంగా పెరిగాయి. నేను కొన్న స్థలం దాదాపు 15 లక్షల విలువ చేస్తుంది. ఇప్పుడు మంచి పెట్టుబడి'' అంటూ నవ్వాడు. పిల్లలకు ఉపయోగపడుతుంది సాలోచనగా అన్నాడు. స్థలం కొన్నాక మిగిలిన డబ్బు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాను. ఆ డిపాజిట్‌ను ఎలా ఉపయోగించానో తెలుసా?'' ప్రశ్నించాడు రమణ.

''నా వద్ద మిగిలిన 75 వేలను 50 భాగాలుగా ఒక్కొక్కటీ రూ. 1500గా విభజించి, మొదటి భాగాన్ని నెల రోజులకు, రెండో భాగాన్ని రెండు నెలలకు ఈ లెక్కన 50 ఫిక్స్‌డ్ డిపాజిట్లు వేశాను. ఆ పైన నమ్మకమైన చిట్‌ఫండ్‌ను ఎంచుకున్నాను. 50 నెలలకు లక్ష రూపాయల చిట్ కట్టాను. దానికి నెలసరి వాయిదా మొదట 1300 రూపాయలతో మొదలై చివరకు 2 వేలకు చేరుతుంది. ప్రతి నెలా చేతికి అందే ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను చిట్‌కు కట్టేవాణ్ణి. అలా 75వేల రూపాయలు లక్ష రూపాయలైంది. మళ్ళీ పాత పార్ములాతోనే దాన్ని రెండు లక్షల చిట్‌గా, చివరకు 5 లక్షల చిట్‌గా పెంచుకున్నాను. ఇప్పుడు ఆ డబ్బుతోనే ఇల్లు కడుతున్నాను. ఇంతకాలం లైబ్రేరియన్‌గా నాకు వచ్చే చిన్న జీతంతోనే సంసారం నెట్టుకొచ్చాను. మధ్యలో ఏదైనా గడ్డు పరిస్థితి వస్తే మోహనరావు గారు నాకు సాయపడుతున్నారు. ఊళ్ళో ఈ మధ్యనే కొన్న ఈ స్థలంలో ఇప్పుడు నీలాంటి మిత్రుల చేయూతతో నేను కూడా ఇల్లు గలవాడినవుతున్నాను'' మాటలు ముగించి చీకట్లోకి చూశాడు రమణ. అవును, పగలైనా రాత్రి అయినా అతడికి కనబడేది చీకటే. దాంట్లో నుంచే వెలుగును సృష్టించుకోగల సమర్థుడు రమణ.

''నా అంగవైకల్యం గురించి ఎన్నడూ పట్టించుకోలేదు. బాధపడలేదు. అయితే, నా ప్రవర్తన నలుగురికీ ఉపయోగపడేదిగా ఉండటంతో లోకం నా గురించి పట్టించుకొంది'' చెప్పాడతను.

***

''నీ తదుపరి ప్రాజెక్టు ఏమిటి?'' అడిగాను.

''ఇల్లు కట్టుకోవడానికి నా దగ్గర ఉన్న డబ్బు అంతా ఖర్చుపెట్టేశాను. మళ్ళీ నా ఖజానా నింపుకునే మార్గం ఆలోచించాలి'' అంటూ ఒకింత ఆదుర్దాగా నవ్వాడు రమణ. ''ఇప్పుడు బ్యాంకు వడ్డీ బాగా తగ్గిపోయింది. ఏదో ఒకటి చేసి నా ఇంటిపై మరో అంతస్తు కడితే అద్దె కింద రాబడి బాగానే వస్తుంది'' అని చెప్పాడు. ఈ ఆలోచన రాగానే అతని ముఖంలో ఆదుర్దా మాయమైంది. అతడి పక్కన మౌనంగా కూర్చున్నాను. తల పైకెత్తి మబ్బుల్లో నా కిష్టమైన పక్షి-డేగ కోసం వెదుకుతున్నాను. అదిగో, ఆకాశంలో సయ్యాటలాడుతున్న డేగల జంట కనించింది. అంతలోనే మబ్బుల మాయమైంది.

''మనం రామకృష్ణ మిషన్ కోసం ఏదైనా చేయాలి'' ఉన్నట్టుండి అన్నాడు రమణ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

'' ఏం చేస్తే బాగుంటుంది?''

మా ఊరిలోని హైస్కూల్ సంస్థాపకుడు బాపిరాజు పదేపదే చేసిన విజ్ఞాపనలను మన్నించి, రామకృష్ణ మిషన్‌వాళ్ళు దాన్ని ఇటీవలే తమ యాజమాన్యంలోకి తీసుకున్నారు. రమణ రోజూ మిషన్‌కు చెందిన స్వామీజీలతో భేటీ వేసి, వారి కార్యకలాపాల గురించి తెలుసుకొంటున్నాడు. మిషన్ రాకతో స్కూలులో విద్యా ప్రమాణాలుబాగా పెరిగాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఊరికి దగ్గర్లో ఎక్కడా ఇంగ్లీష్ మీడియం స్కూల్ లేదు. కాబట్టి రామకృష్ణ మిషన్ వారు ప్రీస్కూల్ దశ నుంచి ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడితే బాగుంటుందని రమణమూర్తి స్వామీజీకి సూచించారు. తమ మిషన్ వ్యక్తుల వినతులకన్నా సామూహిక సూచనలకే విలువ ఇస్తుందని చెబుతూ గ్రామస్థులందరినీ ఈ విషయంలో కలుపుకొని రావాలని స్వామీజీ సలహా ఇచ్చారు. ఇంకేం! రమణ ఊరి వారందరినీ ఏకం చేశాడు. కలకత్తా నుంచి సీనియర్ స్వామీజీ వచ్చినప్పుడు ఆయనతో మాట్లాడటానికి ఇంగ్లీష్ బాగా వచ్చిన నన్ను నియమించాడు. రమణ ప్రారంభించిన కార్యక్రమానికి ఊరి పెద్దలతో కలసి నా వంతు సేవలు అందించాను. మా వూరుకు ఇంగ్లీషు మీడియం స్కూలు వచ్చింది. ఇక స్కూలుకు కొత్త భవనం నిర్మాణం మొదలైంది. దానికి ఊరివారు కూడా తమ వాటా కింద కొంత నిధులు అందిస్తే బాగుంటుందని తలపోశాడు రమణ. వెంటనే రంగంలోకి దిగాడు. మోహన్‌రావుగారి కింద తాను పనిచేసిన రోజుల్లో పరిచయమైన పెద్ద వ్యాపారుల వద్దకూ వెళ్లి విరాళాలు కోరాడు. ఈ విద్యాయజ్ఞంలో నా బోటివాళ్ళను మమేకం చేశాడు. బాధ్యతలు పంచాడు. అందరం కలసి ఒక మంచిపని చేస్తున్నామనే ఆనందాన్ని పంచాడు. దీన్నే సంస్థా నిర్వహణ లేదా మేనేజ్‌మెంట్ అంటారు. టాటాలు, బిర్లాలు తమ కంపెనీలను నడిపేది ఇలాగే. అలనాడు ఇంగ్లండ్ రాణి ఎక్కడో దూరాన కూర్చుని భారతదేశాన్ని పరిపాలించినదీ ఇలానే. సంస్థను నిర్మించు, దాన్ని నడపడానికి సరైనవాళ్ళను నియమించు, ప్రవర్తన నియమావళిని విధించు. ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరేపించు. పనిచేసినవారికి ప్రతిఫలం, చేయని వారికి శిక్ష సూత్రం పాటించు. అన్నింటినీ మించి ప్రతి చిన్న విషయంపై డేగకన్ను సారించు. ఇదే కార్యనిర్వహణ అంటే, ఇదే నాయకత్వమంటే. మా రమణ ఏక కాలంలో మేనేజర్, నాయకుడు, డేగ... ఒక్కమాటలో ఆకాశరాజు. ఊరికి నిజమైన రాజు. సహకారం, సహజీవనం, సమన్వయాలు అతడి విజయ రహస్యం. అదే నిజమైన ధర్మం.

## కన్నయ్యను కాపాడిన కందిపచ్చడి!!!



డెబ్బయ్యేళ్ల క్రితమే... వేసిన మొదటి సినిమాకే... ఐదువేల రూపాయిల పారితోషికం తీసుకున్న సి.ఎస్.ఆర్. తెలుగు సినిమాలోకంలో మొదటి మెగాస్టార్! ద్రౌపదీ వస్త్రాపహరణం సినిమాకు మొదట అనుకున్న బడ్జెట్ 80 వేల రూపాయలు. కానీ, అది ఓవర్ బడ్జెట్టయ్యి ఖర్చు లక్షా ఇరవై వేల దాకా దేకింది. షూటింగంతా కొల్హాపూర్‌లో జరిగింది. నాలుగురోజుల్లో మీ పోర్షన్ పూర్తిచేసి పంపించేస్తాం అన్న ప్రొడక్షన్ వాళ్లు ఈ కృష్ణుణ్ణి ఏకంగా మూడునెల్లు అట్టిపెట్టుకున్నారక్కడ. ఎందుకనిపించిందో ఏమోగానీ ఈయన ముందు జాగ్రత్తగా కొల్హాపూర్‌కు వెంట గోంగూర పచ్చడి, ఆవకాయ తీసుకువెళ్లారు. అప్పట్లో ఎంత పెద్ద నటులైనా ఒకసారి సెట్ మీదకు వెడితే షూటింగయ్యాకే బయటకు రావడం. భోజనాలు, ఫలహారాలు కూడా అక్కడే... సెట్టుమీదే.... సి.ఎస్.ఆర్.కు అక్కడి ఫలహారాలు నచ్చేవి కావు. కృష్ణుడి వేషం వేస్తూ ఆకలికి కుచేల బాధలు పడవలసి వచ్చేది. అందుకని తను బసచేసిన హోటల్లో హాయిగా కందిపచ్చడి ఇంత రుబ్బుకుని దాన్ని చిన్నచిన్న వుండలుగా చుట్టుకున్నారు. షూటింగులో ఆకలేసినప్పుడల్లా ఈ వుండలు నాలిగింటిని మింగి నీళ్లు తాగేసేవారు. అలా కొల్హాపూర్‌లో ఈ కన్నయ్యను కందిపచ్చడే కాపాడింది. వస్త్రాపహరణం సినిమాకు సంబంధించి మరో విశేషం కూడా వుంది. స్టేజిమీద సి.ఎస్.ఆర్. పద్యంపాడితే వన్స్‌మోర్‌లు మామూలే. కానీ, ఆయన సినిమాల్లోకి వెళ్లినా కూడా ఈ వన్స్‌మోర్‌లు ఆయన్ని వదల్లేదు. వస్త్రాపహరణం విడుదలైన థియేటర్లలో ఇలాంటి వన్స్‌మోర్‌లు చాలాచోట్లే వుండేవి. కేబిన్ గదిలోని ఆపరేటర్లుకూడా చాలా బుద్ధిగా రీలును మళ్లీ వెనక్కు తిప్పి ఆ పద్యం రిపీట్ చేసేవారు. ఆ తరువాత ఎప్పుడో ఎనిమిదేళ్లకు వచ్చిన భీష్మ (1944-శోభనాచల-చిత్రపు నారాయణమూర్తి-గౌరీనాథశాస్త్రి, కృష్ణవేణి) విషయంలోనూ ఇలానే జరిగింది. అందులోనూ ఈయన కృష్ణుడే మరి....